# బిజెపికి ఓటుతో బుద్ధి చెప్పండి

- రైతులను, వ్యాపారులను దగా చేసిన పార్టీ కాంగ్రెస్
- దసరా నాటికి సిఎం చేతుల మీదుగా ఆస్పత్రి ప్రారంభం
- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపికి ఓటుతో బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ జిల్లాలో రూ.615 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి కెటిఆర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం సాయంత్రం ఆజాంజాహి మిల్లు మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభకు బిఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు అరూరి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. మోడీ ప్రియమైన ప్రధానమంత్రి కాదని, ఫిరమైన ప్రధానమంత్రి అని అభివర్ణించారు. ఈయన హయాంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటాయన్నారు. గ్యాస్ ధర రూ.400 నుండి రూ.1,200లకు పెరిగిందన్నారు. గతంలో ఈయన గుజరాత్ సీఎంగా వున్నప్పుడు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను చేతకాని ప్రధాని అని తిట్టాడని, నేడు ప్రధానిగా వున్న మోడీ ఆ గ్యాస్ ధరను రూ.400ల నుండి రూ.1,200లకు పెంచారన్నారు. కుల, మత పిచ్చితో ప్రజలను రెచ్చకొట్టి బిజెపి రాజకీయాలు చేస్తోందన్నారు. పెద్ద నోట్ల రద్దుతో మోడీ పేదలకు లాభం జరిగిందని ప్రచారం చేశాడన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వలేదని, గుజరాత్‌లో మాత్రం ప్రధాని మోడీ రూ.20 వేల కోట్లతో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకున్నాడన్నారు. ములుగులో 350 ఎకరాలను కేటాయించినా గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయలేదన్నారు. 8 ఏండ్లుగా మామునూరు ఏయిర్‌పోర్ట్ అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వరంగల్ గడ్డ నుండి బిజెపికి గట్టి సమాధానం చెప్పాలన్నారు. మోడీ ప్రభుత్వానికి ఓటుతో గట్టి జవాబివ్వాలని కోరారు. గతంలో 55 ఏండ్లపాటు కరెంటు ఇవ్వని కాంగ్రెస్ పార్టీ దద్దమ్మ పార్టీ అని అభివర్ణించారు. రైతులను, వ్యాపారులను దగా చేసిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనే రాష్ట్రంలోనే అతిపెద్ద దవాఖాన 24 అంతస్తుల 2 వేల పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నామన్నారు. దసరా నాటికి సిఎం కెసిఆర్ ఈ ఆసుపత్రిని ప్రారంభిస్తారన్నారు. వరంగల్‌లో రూ.313 కోట్లతో ఇన్నర్ రింగ్ రోడ్డుకు శంకుస్థాపన, 2 ఎకరాలలో రూ.80 కోట్లతో కలెక్టరేట్ భవనం, రూ.77.50 కోట్లతో కొత్తగా వరంగల్ బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. రూ. 50 కోట్లతో మంచినీటి సరఫరా పనులకు శంకుస్థాపన, రూ.20 కోట్లతో సీవరేజీ ప్లాంట్‌ను ప్రారంభించుకున్నామన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న కెటిఆర్

**సంబురాలు చేసుకోవద్దా..?**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేండ్లు పూర్తయి పదో యేటా ప్రవేశించిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటుంటే.. ఏం సాధించారని ఉత్సవాలు చేసుకుంటున్నారని కాంగ్రెస్, బిజెపి నేతలు విమర్శిస్తున్నారన్నారు. ఇవ్వాల గిరిజన దినోత్సవం జరుపుకుంటున్నామని, 60 ఏండ్లు కాంగ్రెసోళ్లు గిరిజన బిడ్డలను పట్టించుకోలేదని, తెలంగాణ రాష్ట్రం వచ్చాక సిఎం కెసిఆర్ 3,416 తండాలు, ఆదివాసీ గూడాలను గ్రామపంచాయతీలు చేసుకుంటే సంబురాలు చేసుకుంటే తప్పా ? అని ప్రశ్నించారు.

**'నన్నపనేని'కి షాక్..**

మంత్రి కెటిఆర్ ఉదయం పరకాల నియోజకవర్గం సంగెం మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌లో యంగ్‌వన్ కంపెనీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతూ.. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి అక్కడ పోటీయే లేదన్నారు. గతంలో పోటీ చేసినోళ్లే పక్క నియోజకవర్గానికి వెళ్లిపోయారని, మీసాలు తిప్పినోళ్లే అక్కడి నుండి వెళ్లిపోయారని, వారెవరో మీకు తెలుసని ఆయన మళ్లీ బ్రహ్మాండమైన మెజార్టీతో గెలుస్తారన్నారు. సాయంత్రం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జరిగిన బహిరంగసభలో సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ విషయంలో మాత్రం మంత్రి కెటిఆర్ సీఎం ఆశీర్వాదముంటే .. మీ దయ వుంటే నరేందర్‌ను గెలిపించాలని' కోరారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పార్టీ టికెట్‌ల విషయంలో మంత్రి కెటిఆర్ స్పష్టతనిచ్చారు. చల్లా ధర్మారెడ్డి అభ్యర్థిత్వంపై స్పష్టతనిచ్చి 'నన్నపనేని' విషయంలోనే అస్పష్టత వ్యక్తం కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ సభలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. 'మీరు ఏ అభ్యర్థిని నిలబెట్టినా భారీ మెజార్టీతో గెలిపిస్తామని' వ్యాఖ్యానించడం సైతం చర్చకు దారితీసింది. ఈ సభలో శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, జడ్పీ ఛైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎంపీలు పి.దయాకర్, మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, శంకర్‌నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, కుడా ఛైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రెండ్రోజులు వడగాలులు

- మూడ్రోజుల తర్వాత వర్షాలు
- వాతావరణ శాఖ నివేదిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మరో రెండ్రోజులు తీవ్రమైన వడగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఆ తర్వాత వేడి తగ్గుముఖం పట్టే సూచనలు ఉన్నాయని అంచనా వేసింది. రాష్ట్రంలోకి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో వడగాల్పుల తీవ్రత కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే రెండ్రోజుల తర్వాత ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకూ రాయలసీమ, కర్ణాటక, తమిళనాడు, కేరళలో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రస్తుతం నైరుతీ రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట, పుట్టపర్తి, కర్ణాటకలోని రత్నగిరి, కొప్పాల్ వరకూ విస్తరించి ఉన్నాయి. ఆదివారం నుంచి ఇవి ఇతర ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని తెలంగాణలో ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కుమురం భీం, నిర్మల్, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయి. వచ్చే మూడు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు డైరెక్టర్ తెలిపారు.

## వడదెబ్బతో బాలిక మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసిఫాబాద్ జిల్లాలో వారం రోజుల నుంచి తీవ్రమైన ఎండలు ఉండటంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. చీలపెల్లి గ్రామానికి చెందిన మహేశ్వరి(8) వడదెబ్బతో శుక్రవారం రాత్రి కాగజ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి ఇంటికి వచ్చి స్నేహితులతో ఆడుకుంది. శుక్రవారం ఉదయం వాంతులు చేసుకొని కండ్లు తిరిగి పడిపోవడంతో కాగజ్‌నగర్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం కొంతమేర మెరుగుపడటంతో ఇంటికి తీసుకొచ్చారు. అదే రోజు సాయంత్రం మళ్లీ వాంతులు చేసుకోవడంతో అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడికి వెళ్తుండగా మార్గమధ్యలోనే బాలిక మృతి చెందారు.

## అది నిరంతర ప్రక్రియ

- 'బిసిలకు రూ. లక్ష సాయం' పై మంత్రి గంగుల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో చేతివృత్తుల వారి జీవన ప్రమాణాలు పెంచడానికి వీలుగా బిసిలకు రూ.లక్ష సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిందనీ, అయితే అది ఒక నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి గంగుల అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ భేటీలో మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం తగిన కృషి చేస్తున్నదని తెలిపారు. కులవృత్తుల్లోని చేతివృత్తులకు చేయూతనిచ్చి ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ప్రత్యేకంగా రూ. లక్ష సాయాన్ని సిఎం ప్రకటించారని గుర్తు చేశారు. అందుకు సంబంధించి శనివారం వరకు 2,70,000 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయని తెలిపారు.

మొదటగా అర్హత కలిగిన లబ్ధిదారుల్లోని అత్యంత పేదవారికి అందజేస్తామని వెల్లడించారు. ప్రతి నెలా 5వతేదీ లోపు కలెక్టర్లు లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రులు ధృవీకరించిన జాబితాలోని లబ్ధిదారులకు ప్రతీ నెల 15వ తారీఖున స్థానిక ఎమ్మెల్యేల చేతుల మీదుగా సహాయాన్ని అందజేస్తామన్నారు. దరఖాస్తుదారులు కేవలం https://tsobmmsbc.cgg.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఫారాన్ని ఏ ఆఫీసులోనూ, ఏ అధికారికి సమర్పించాల్సిన అవసరం లేదని గుర్తుచేశారు. ఎంపికైన లబ్ధిదారులు నెలరోజుల్లోపు తమకు నచ్చిన, కావాల్సిన పనిముట్లను, సామాగ్రిని కొనుక్కోవాలని సూచించారు. లబ్ధిదారుల అభివృద్ధి కోసం అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. నెలలోపు లబ్ధిదారులతో కూడిన యూనిట్ల ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. బిసి సహాయం పథకం తొలిదశ అమలును బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం క్యాబినెట్ సబ్ కమిటీకి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, బిసి సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బి వెంకటేశం, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ అధికారులు పాల్గొన్నారు.



క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి

## ఫైటర్ జెట్లలో మహిళలకు ప్రాధాన్యత

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫైటర్‌జెట్ పైలట్లలో మహిళలు ఎక్కువమంది ఉండటం సంతోషంగా ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రివ్యూయింగ్ ఆఫీసర్‌గా ఆమె హాజరయ్యారు. క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించి, మాట్లాడారు. క్యాడెట్లకు శుభాకాంక్షలు తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారి సేవలను గుర్తుంచుకోవాలని చెప్పారు. టర్కీ భూకంప సహాయక చర్యల్లో వాయుసేన బాగా పనిచేసిందనీ, కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. దేశ భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా గతంలో సుఖోయ్ జెట్‌లో తన ప్రయాణ అనుభూతిని ఆమె క్యాడెట్లతో పంచుకున్నారు. ఈ తరహా పరేడ్‌కు రివ్యూయింగ్ అధికారిగా రాష్ట్రపతి వ్యవహరించడం ఇదే తొలిసారి అని ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి అంజన్‌కుమార్ పాల్గొన్నారు. మొత్తం 119 ఫ్లయింగ్ ఎయిర్ ట్రైనీ, 75 మంది గ్రౌండ్ డ్యూటీ ట్రైనీ క్యాడెట్లు దుండిగల్‌లో శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరితో పాటు ఇద్దరు వియత్నాం క్యాడెట్లు, ఆరుగురు నేవీ, కోస్ట్‌గార్డ్‌కు చెందిన క్యాడెట్లు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు.

## తెలంగాణ నిర్మాణాలకు గ్రీన్‌యాపిల్ అవార్డులు

- లండన్‌లో అందుకున్న అర్వింద్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐదు అద్భుత నిర్మాణాలకు గ్రీన్ యాపిల్ అవార్డులు లభించాయి. లండన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ అందు కున్నారు. హైదరాబాద్‌లోని మొజాంజాహీ మార్కెట్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్, యాదగిరిగుట్ట దేవాలయ నిర్మాణాలకు ఇంటర్నేషనల్ బ్యూటిఫుల్ బిల్డింగ్స్ కేటగిరిలో ఈ అవార్డులు లభించాయి. దేశంలోని నిర్మాణాలు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకోవడం ఇదే తొలిసారి. తెలంగాణ రాష్ట్ర నిర్మాణాలకే ఐదు విభాగాల్లో అవార్డులు రావడం మరో ఘనతగా అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ భవనాల డిజైన్, ఆర్కిటెక్చర్ ప్రతిభకు ఈ అవార్డులు గుర్తింపు తెస్తున్నాయని చెప్పారు. రాష్ట్రానికి గతంలో వరల్డ్ గ్రీన్‌సిటీ అవార్డ్(2022), ట్రీ సిటీ ఆఫ్ ద వరల్డ్ అవార్డ్(2021), లివింగ్, ఇన్‌క్లూజన్ అవార్డ్–స్మార్ట్‌సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్(2021) వంటి ప్రపంచస్థాయి అవార్డులు లభించిన విషయం తెలిసిందే.

## హరగోపాల్‌పై ఉపా కేసును ఎత్తేయాలన్న ఆదేశాలను స్వాగతిస్తున్నాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రొఫెసర్ హరగోపాల్‌పై పెట్టిన ఉపా కేసును ఎత్తేయాలంటూ సిఎం కెసిఆర్ డిజిపిని ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడేవాళ్ల గొంతులను నొక్కడానికి ప్రభుత్వాలు ఉపా చట్టాన్ని ప్రయోగిస్తున్నాయని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే ఈ చట్టాన్ని ఎత్తేయాలంటూ సిపిఎంతోపాటు, వామపక్షాలు, ప్రజాతంత్రవాదులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాయని పేర్కొన్నారు. హరగోపాల్‌తోపాటు ఇతరులపై పెట్టిన కేసులను కూడా ఎత్తేయాలని కోరారు. భవిష్యత్‌లో కూడా రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయొద్దని సూచించారు. ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగపరుస్తున్న ఈ చట్టాన్ని ఉపసంహరించుకునేందుకు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై పోరాడేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ చొరవ చూపాలని తమ్మినేని విజ్ఞప్తి చేశారు.




మహాసభలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి

## భారత రాజ్యాంగం ఒక జీవన విధానం

- సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సుదర్శన్ రెడ్డి
- ఘనంగా ప్రారంభమైన ఐలూ రాష్ట్ర 3వ మహాసభ
- జెండాను ఆవిష్కరించిన సీనియర్ న్యాయవాది కొత్త బుచ్చిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగం కేవలం లిఖితపూర్వకమైన డాక్యుమెంటే కాదు.. అది ఒక జీవన విధానమని, భారతదేశం ఎలా ఉండాలి అనే ఒక ఆలోచన అని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఏ.అనంతరెడ్డినగర్, కొండపల్లి ఉత్తమ కుమార్(దీప్తి హోటల్లో) ప్రాంగణంలో శనివారం ఐలూ రాష్ట్ర అధ్యక్షులు జె.విద్యాసాగర్ అధ్యక్షతన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభ ప్రారంభమైంది. ముందుగా అఖిలభారత న్యాయవాదుల సంఘం జెండాను సీనియర్ న్యాయవాది, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు కొత్త బుచ్చిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తి సాధారణ వృత్తి కాదన్నారు. రాజ్యాంగంలో రాసిన.. పేర్కొనబడిన ఏకైక వృత్తి అని తెలిపారు. న్యాయవాదిగా బార్ కౌన్సిల్లో ఎంటర్ అయినప్పుడు చేసిన శపథం మరోసారి అందరం చదువుకోవాలని సూచించారు. భారత రాజ్యాంగంలోని పౌర హక్కులు, చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత మనపై ఉందని, ఇది ఉన్నతమైన వృత్తి అని చెప్పారు. ఈ మహాసభలో యూనియన్ ఆల్ ఇండియా కార్యదర్శి సురేంద్రనాథ్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు నాగారం అంజయ్య, ఏఐఎల్ రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శులు కొల్లి సత్యనారాయణ, నర్రా శ్రీనివాసరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మామిడి వెంకటరెడ్డి, ఎండి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న ఐలూ రాష్ట్ర మహాసభ**

ఐలూ రాష్ట్ర మహాసభ ప్రాంగణంలో భువనగిరి చరిత్రకు సంబంధించిన సుమారు 60 కటౌట్లను ఏర్పాటు చేశారు. న్యాయవాదుల హక్కులు, డిమాండ్లు, కక్షిదారుల ఇబ్బందులకు సంబంధించిన ప్రచురణలను ప్రదర్శించారు. అవి న్యాయవాదులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ చిత్రకారుడు చంద్రకుమార్ వాటిని తయారు చేశారు.

## తెలంగాణ అభివృద్ధికి సహకరించాం

- రిపోర్టు టు ద పీపుల్ పేరుతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొమ్మిదేండ్లలో కేంద్రం నుంచి రాష్ట్ర అభివృద్ధికి పూర్తిగా సహకరించామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులపై హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి ఆర్‌టిసి కల్యాణ మండపంలో శనివారం పవర్ ప్లాంట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే పన్నుల వాటా శాతం పెరిగిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోడీ ఎంతగానో సహకరించారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రానికి తొమ్మిదేండ్లలో రూ.5లక్షల 27వేల కోట్లు వచ్చినట్టు చెప్పారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఇద్దరూ ఒకే వేదికపై ఇలాంటి చర్చ చేస్తే అన్ని రాజకీయ పార్టీలకు ప్రజా ఎజెండాగా మారే అవకాశం ఉంటుందని ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏం చేసింది.. ఇంకా ఏం చేయడానికి అవకాశం ఉంది.. అనే అంశాల మీద ప్రజలకు అవగాహన వస్తుందన్నారు.రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినా, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినా అన్నీ ప్రజాధనంలో నుంచే కేటాయిస్తాయని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి గురించి పౌర సమాజం, మేధావులు, ఆలోచనాపరులు, పాత్రికేయులు సోషల్ స్క్రూటీ ఉండే విధంగా ఒక వ్యవస్థ ఏర్పాటు చేస్తానని సిఎం గతంలో ప్రకటించారని చెప్పారు. ఇలాంటి బహిరంగ చర్చల ద్వారా ప్రభుత్వం గురించి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం సాధ్యమవుతుందన్నారు. ఇలాంటి బహిరంగ చర్చా వేదికలు మంచి సంప్రదాయమని సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇలాంటి చర్చా వేదికల ద్వారా వాస్తవానికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఎక్కడున్నాయి.. అనే అంశాల పట్ల శోధించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే రఘునందన్ రావు, నాయకులు డీకే అరుణ, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం ప్రత్యేకంగా ఏమిచ్చింది..?

- జిఎస్‌టి పరిహారం చెల్లించలేదు
- ఆర్థిక మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పిన అబద్ధాలనే కిషన్‌రెడ్డి రిపీట్ చేశారని ఆర్థిక మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ నిరంతర సహకారంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌పై మంత్రి హరీశ్‌రావు స్పందించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు రూ.1.43లక్షల కోట్లు వెంటనే విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. పన్నుల పంపిణీ అనేది రాష్ట్రాల రాజ్యాంగ హక్కు.. పన్నుల పంపిణీ భారతదేశం కన్సాలిడేటెడ్ ఫండ్‌లో భాగంగా కాదని హరీశ్‌రావు తెలిపారు. ఫైనాన్స్ కమిషన్ సిఫారసు చేసిన కేంద్ర పన్నుల్లో అన్ని రాష్ట్రాల వాటా 41శాతం ఉన్నప్పటికీ, రాష్ట్రాలు కేంద్ర పన్నుల్లో దాదాపు 30శాతం మాత్రమే పొందుతున్నాయన్నారు. పన్నుల భాగస్వామ్య పూల్‌లో భాగంకాని సెస్సులు, సర్ ఛార్జీలు కేంద్రం విధిస్తోందన్నారు. పన్నుల పంపిణీలో తెంగాణ వాటా 2014-15లో 2.893శాతం ఉండగా 2021-22 నాటికి 2.102 శాతానికి తగ్గిందని వెల్లడించారు. కేంద్ర వాటాగా రూ.1588.08 కోట్లతో తెలంగాణలో 100 శాతం ఇళ్లకు నల్లాల ద్వారా నీటిని సరఫరా చేశామని కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు మిషన్ భగీరథ కింద రూ.36వేల కోట్లు వెచ్చించి 100 శాతం గృహాలకు నీటిసరఫరా చేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేంద్రం ఇస్తున్న మొత్తం మిషన్ భగీరథ నిర్వహణకు కూడా సరిపోదన్నారు.తెలంగాణ నుంచి 2017-18, 2022-23 వరకు జిఎస్‌టి పరిహారం సెస్‌గా రూ.34,737 కోట్లు వసూలు చేశారు.. కానీ తెలంగాణకు దక్కింది కేవలం రూ.8,927 కోట్లు మాత్రమేనని వివరించారు. జిఎస్‌టి ప్రవేశపెట్టిన మొదటి రెండేళ్లలో పరిహారంగా వచ్చింది రూ.169 కోట్ల మాత్రమేనని హరీష్ రావు తెలిపారు. ఈ రెండేళ్లలో తెలంగాణ నుంచి వసూలైన జిఎస్‌టి సెస్ రూ.10,285 కోట్లని వెల్లడించారు. పరిహారం మొత్తం భారత కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి రాలేదు కానీ, జిఎస్‌టి పరిహార నిధి నుంచి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి పరిహారం చెల్లించిందన్న వాదన సరికాదని, అది తమ హక్కు అని తెలిపారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్94(2) ప్రకారం ఐదేళ్ల కాలానికి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం విడుదల చేసింది రూ.2,250 కోట్లు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చట్ట ప్రకారం ఉన్న 2019-20, 2020-21, 2022-23 సంవత్సరాలకు ఎటువంటి మొత్తం విడుదల కాలేదన్నారు. కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించి రాష్ట్రప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ ఈ మూడేళ్లకు గాను రూ.1350 కోట్లు ఎలాంటి కారణం లేకుండా నిలుపుదల చేశారని పేర్కొన్నారు. దీనిపై కిషన్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. జాతీయ రహదారులకు కేటాయింపులు రోడ్డు, మౌలిక సదుపాయాల సెస్‌ల నుంచి జరుగుతాయి. కేంద్ర ప్రభుత్వంపై అదనంగా పడే భారం ఏమీ ఉండదన్నారు.తెలంగాణకు కేటాయించిన నిధులు కిషన్‌రెడ్డి మెహర్బానీతో రాలేదన్నారు.

# జులై ఐదు తర్వాత సమ్మెలోకి...

- ఈ నెల 24న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు
- తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



సమ్మె నోటీసును మీడియాకు చూపుతున్న నాయకులు

జూలై ఆరు నుంచి గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు నిరవధిక సమ్మె చేయనున్నట్టు గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి చైర్మన్ పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎన్ యజ్ఞానారాయణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 17 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును ఈ నెల 5న జెఏసి ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్‌కు అందజేసినట్టు తెలిపారు. పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికుల మాదిరిగా కేటగిరీల వారీగా వేతనాలను రూ.15,600, రూ. 19,500, రూ.22,750గా పెంచాలని జెఎసి డిమాండ్ చేసిందని గుర్తు చేశారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలనీ, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలనీ, పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలనీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె నోటీసు ప్రభుత్వ అధికారులకు అందజేశామని జెఎసి నేతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21లోగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేదంటే.. ఏ రోజునుండైనా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపడతామని తెలిపారు. 12 రోజులు గడిచినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం జేఏసి డిమాండ్లపై ప్రభుత్వం స్పందించలేదని జెఎసి నేతలు తెలిపారు. దీంతో శనివారం మరోసారి పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు (ఐఎఎస్)ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కమిషనర్ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామనీ, ఇతర సమస్యలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని ఈ మేరకు కమిషనర్ తెలిపారు. ప్రధాన సమస్యలపై ఎలాంటి స్పష్టత రాకపోవడంతో సమస్యల పరిష్కారం కోసం ఆందోళన – పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 24న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. సమ్మె సన్నాహక సదస్సులు జరపాలని కోరింది. జూలై ఐదో తేదీ లోపు సమస్యలు పరిష్కరించాలనీ, లేకుంటే మరుసటి రోజు నుంచే రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతామని తెలిపింది. సమ్మె నోటీసును అందజేసిన వారిలో జెఏసి చైర్మన్ పాలడుగు భాస్కర్( సిఐటియు), టీజీకేబీయూ జనరల్ సెక్రటరీ ఎన్ యజ్ఞనారాయణ, ఎఐటియుసి నాయకులు బి వెంకటరారజం,సలహాదారు కె. సూర్యం(ఐఎఫ్‌టియు), కన్వీనర్లు పి.శివబాబు (ఐఎఫ్‌టియు), ఎన్ దాసు (ఐఎఫ్‌టియు), సిహెచ్ వెంకటయ్య(సిఐటియు), టి.నర్సింహా రెడ్డి (ఎఐటియుసి), కో కన్వీనర్ జయచంద్ర(ఎఐటియుసి), పాలడుగు సుధాకర్(సిఐటియు), కమిటీ సభ్యులు గ్యార పాండు(సిఐటియు),పుట్ట యాదమ్మ (సిఐటియు) తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఇంట్లో ముగిసిన సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బిఆర్ఎస్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఇంట్లో వరుసగా మూడు రోజులు ఐటీ అధికారులు నిర్వహించిన సోదాలు శనివారం ముగిశాయి. ఎమ్మెల్యేకు చెందిన కంపెనీలు, వాటి ఆర్థిక లావాదేవీలపై వివరాలు సేకరించినట్లు సమాచారం. తన ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించడంపై పైళ్ల శేఖర్‌రెడ్డి స్పందించారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఐటీ దాడులు జరిగాయని ఆరోపించారు. ఐటీ అధికారులకు పూర్తిగా సహకరించినట్లు చెప్పారు. మొదటిరోజు గంటన్నరలోనే ఐటీ దాడులు పూర్తయ్యాయి.. కానీ అధికారులు కావాలనే మూడు రోజులు కాలయాపన చేశారన్నారు.

"నాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం. పాతికేళ్లుగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాను. విదేశాల్లో మైనింగ్ వ్యాపారాలు ఉన్నాయన్నది అవాస్తవం. ఐటీ అధికారులు నాకు నోటీసు ఇచ్చారు. విచారణ కోసం ఎప్పుడు పిలిచినా వెళ్లేందుకు సిద్ధం. అనుకూలమైన సమాచారం రాకపోవడంతో ఐటీ అధికారులు నిరుత్సాహంగా వెనుదిరిగారు" అని పైళ్లశేఖర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే బంధువుల వ్యాపార లావాదేవీలతోపాటు, వారి ఇళ్లలోనూ సోదాలు జరిపిన ఐటీ అధికారులు.. పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

**BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-XVI ADDITIONAL DISTRICT JUDGE AT NANDIGAMA**

**M.V.O.P.No. 110 / 2022**

Between:
Peetha Usha and 3 others
... PETITIONERS.
And
Madduri Ravi @ Ravinder and one another
...RESPONDENTS.

To,
Madduri Ravi @ Ravinder S/o Istari, Owner –cum- Driver of the lorry bearing No. TS 08 UG 9279, R/o Door No. 2-93/2/74, Ground Floor, Devender Nagar, Bodduppal, Uppal, Hyderabad - 500 092, State of Telangana Phone: 9059541366.

పై నెంబరు ఓ.పిలో మీరు 1వ రెస్పాండెంట్ అయివుండి, మీకు ఎన్ని మార్లు నోటీసులు పంపించి యున్నను నోటీసులు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు 1వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసు అమలుజరుపుటకు గాను పత్రికా ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయుటకుగాను ది.27.06.2023వ తేదినకు తమరి హాజరు నిమిత్తం వాయిదా ఇచ్చి వున్నారు. కావున పైన తెలియ చేసిన తేదినకు మీరు స్వయముగా గాని లేక న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు శ్రీ కోర్టు వారికి తెలియ చేసుకోనగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును.

**శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో.**

ఇట్లు
**షేక్ కరీముల్లా,**
న్యాయవాది, నందిగామ
Nandigama :
Date: 15 .06.2023

# ఆంగ్ల మాధ్యమంపైనే ఆసక్తి

- ఆ మీడియంలో 93.55 శాతం మందికి సీట్లు
- కామర్స్‌లో చేరేందుకే ఎక్కువ మంది మొగ్గు
- దోస్త్ తొలివిడతలో 73,220 మందికి సీట్ల కేటాయింపు
- 63 కాలేజీల్లో సున్నా ప్రవేశాలు
- బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ ఆనర్స్ కోర్సుకు ఆదరణ
- మరిన్ని కాలేజీల్లో ప్రవేశపెడతాం
- నాన్ దోస్త్ కళాశాలలకు కొత్త కోర్సుల అనుమతి ఇవ్వం
- నవీన్ మిట్టల్, లింబాద్రి వెల్లడి




ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిగ్రీలో ఆంగ్ల మాధ్యమంలో చదివేందుకే ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. దోస్త్ తొలివిడత సీట్ల కేటాయింపులో 93.55 శాతం మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో సీట్లు పొందడం గమనార్హం. గతేడాది ఇంగ్లీష్ మీడియంలో 90.89 శాతం మందికి సీట్లు వచ్చాయి. ఈ ఏడాది 2.66 శాతం అధికంగా చేరేందుకు మొగ్గు చూపారు. ఇక తెలుగు మాధ్యమంలో కేవలం 5.77 శాతం మంది సీట్లు పొందారు. గతేడాది ఈ మాధ్యమంలో 8.26 శాతం మందికి సీట్లు కేటాయించారు. ఈ ఏడాది 2.49 శాతం మంది తగ్గడం గమనార్హం. హిందీ మాధ్యమంలో తొమ్మిది మంది, ఉర్దూ మాధ్యమంలో 484, అరబిక్‌లో ఏడుగురికి సీట్లు కేటాయించారు. ఉన్నత విద్యకు వెళ్లాలన్నా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలన్నా ఇంగ్లీష్ మాధ్యమంలో చదివిన వారికి ఎక్కువ ప్రాధాన్యత లభిస్తున్నది. అందుకే ఎక్కువ మంది విద్యార్థులు ఆ మాధ్యమంలో చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి శుక్రవారం తొలివిడత సీట్లు కేటాయించారు. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దోస్త్‌కు తొలివిడతలో 1,05,935 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 78,212 మంది విద్యార్థులు వెబ్ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. 73,220 మందికి సీట్లు కేటాయించామని చెప్పారు. సరిపోయినన్ని వెబ్ఆప్షన్లు నమోదు చేయకపోవడం వల్ల 4,992 మంది విద్యార్థులు సీట్లు పొందలేకపోయారని అన్నారు. మొదటి ఆప్షన్‌తోనే 53,032 మంది, రెండో ఆప్షన్‌తో 19,909 మంది విద్యార్థులు సీట్లు పొందారని వివరించారు.

**డిగ్రీలో మిగిలిన 2.83 లక్షల సీట్లు**

రాష్ట్రంలో 889 (గురుకులాలు కలిపి) డిగ్రీ కాలేజీల్లో 3,56,258 సీట్లున్నాయని నవీన్ మిట్టల్, లింబాద్రి చెప్పారు. అందులో 73,220 మందికి సీట్లు కేటాయించామన్నారు. దీంతో డిగ్రీ కాలేజీల్లో 2,83,038 (79.45 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఈనెలాఖరులోగా విడుదల చేస్తామన్నారు. దోస్త్ తర్వాతి విడతల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరుతారని అన్నారు. డిగ్రీ కోర్సుల్లో కామర్స్‌లోనే ఎక్కువ మంది చేరేందుకు మొగ్గు చూపుతున్నారని వివరించారు. 33,251 (45.41 శాతం) మందికి సీట్లు కేటాయించామని చెప్పారు. బీకాం కంప్యూటర్ కోర్సులో చేరేందుకు 1,04,687, బీకాం జనరల్‌లో చేరేందుకు 12,651 వెబ్ఆప్షన్లను విద్యార్థులు నమోదు చేశారని వివరించారు. ఆర్ట్స్‌లో 7,771 (10.61 శాతం), లైఫ్‌సైన్సెస్‌లో 16,434 (22.44 శాతం), ఫిజికల్ సైన్సెస్‌లో 13,468 (18.39 శాతం), డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ (ఏఐ అండ్ ఎంఎల్)లో 1,955 (2.67 శాతం), డీఫార్మసీలో 254 (0.35 శాతం), ఇతర కోర్సుల్లో 87 (0.12 శాతం) మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని చెప్పారు. సీట్లు పొందిన వారిలో అబ్బాయిలు 29,107 (39.75 శాతం), అమ్మాయిలు 44,113 (60.25 శాతం) మంది ఉన్నారని వివరించారు. అబ్బాయిల కంటే అమ్మాయిలు 20.5 శాతం అధికంగా సీట్లు పొందిన వారిలో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 63 డిగ్రీ కాలేజీల్లో సున్నా ప్రవేశాలు నమోదయ్యాయని వివరించారు. సీట్ల కేటాయింపు వివరాలను విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా పంపించామన్నారు. ప్రయివేటు కాలేజీల్లో సీట్లు పొందిన వారు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించి ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చే విద్యార్థులు రూ.500, రానివారు రూ.వెయ్యి చెల్లించి ఆన్‌లైన్‌లో ఈనెల 25 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా సీట్లను రిజర్వ్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, విశ్వవిద్యాల కాలేజీల్లో సీట్లు పొంది ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్న వారు సెల్ఫ్‌రిపోర్టింగ్ కోసం ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

**నాన్ దోస్త్ కాలేజీలపై అధ్యయనానికి త్రిసభ్య కమిటీ**

నాన్ దోస్త్ కాలేజీలపై అధ్యయనం కోసం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని నవీన్ మిట్టల్, లింబాద్రి చెప్పారు. 38 నాన్ దోస్త్ కాలేజీ యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించామని అన్నారు. అయితే డిగ్రీలో ప్రవేశపెట్టిన కొత్తకోర్సులను నాన్ దోస్త్ కాలేజీలు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. రెండో విడత తర్వాత ఏదైనా కాలేజీ లేదా కోర్సులో 15 మంది కంటే తక్కువ చేరితే వేరే కాలేజీ లేదా వేరే కోర్సులో చేరాలంటూ విద్యార్థులకు సమాచారం అందిస్తామని వివరించారు. అయితే కొత్తగా ప్రారంభించిన బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఆనర్స్ కోర్సుకు విద్యార్థుల నుంచి మంచి ఆదరణ వచ్చిందన్నారు. 13 ప్రభుత్వ, ఒక ప్రయివేటు కలిపి 14 డిగ్రీ కాలేజీల్లో ఈ కోర్సును ప్రవేశపెట్టామని, వాటిలో 880 సీట్లుంటే, తొలివిడతలోనే 662 మంది విద్యార్థులు సీట్లు పొందారని అన్నారు. మరిన్ని డిగ్రీ కాలేజీల్లో ఈకోర్సును ప్రవేశపెడతామని చెప్పారు. ప్రభుత్వ సిటీ కాలేజీలో బీఎస్సీ ఆనర్స్ బయోటెక్నాలజీ కోర్సును ప్రారంభించామని, 60కి 60 సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. రాష్ట్రంలో ప్రముఖ డిగ్రీ కాలేజీలకు ఎక్కువ డిమాండ్ ఉన్నదని అన్నారు. నిజాం కాలేజీలో 1,050 సీట్లుంటే 35,117 మంది, ప్రభుత్వ సిటీ కాలేజీలో 1,509 సీట్లకుగాను 22,802 మంది, తెలంగాణ మహిళా వర్సిటీ కాలేజీలో 1,777 సీట్లుంటే, 19,600 మంది, సైఫాబాద్ కాలేజీలో 730 సీట్లకుగాను 12,190 మంది వెబ్ఆప్షన్లు నమోదు చేశారని చెప్పారు.

**దోస్త్ రెండో విడత రిజిస్ట్రేషన్లు షురూ**

దోస్త్ రెండో విడత కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైందని నవీన్ మిట్టల్, లింబాద్రి చెప్పారు. ఈనెల 27 వరకు రిజిస్ట్రేషన్లు, వెబ్ఆప్షన్లు నమోదు చేసుకోవడానికి గడువుందని వివరించారు. దోస్త్ తొలివిడతలో సీట్లు రాని విద్యార్థులు, సీట్లు పొందినా వేరే కోర్సు లేదా కాలేజీ మారాలనుకునే వారితోపాటు ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకోని వారు రెండో విడతలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 30న సీట్లు కేటాయిస్తామన్నారు. తుదివిడత సీట్లు కేటాయించే వరకు విద్యార్థులెవరూ కాలేజీకి వెళ్లాల్సిన అవసరం లేదని, ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇవ్వొద్దని, ఫీజు కట్టాల్సిన పనిలేదని చెప్పారు. జులై 17 నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. కరోనా తర్వాత ఈ విద్యాసంవత్సరం సాధారణ పరిస్థితులు నెలకొంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నింజే, కళాశాల విద్యాశాఖ ఆర్జేడీ జి యాదగిరి, జెడి డీఎస్ఆర్ రాజేందర్ సింగ్, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డి తిరువెంగళచారి, దోస్త్ టెక్నికల్ కోఆర్డినేటర్ గజేంద్రబాబు, ఐసీటీ అధికారి యమునారాణి, రూసా రీసెర్చ్ ఆఫీసర్ డి వసుంధర, దోస్త్ హెల్ప్‌డెస్క్ కోఆర్డినేటర్ ఎం విజయరెడ్డి, దోస్త్ టెక్నికల్ సపోర్టు సిహెచ్ కిషోర్‌కుమార్, సీజీజీ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ పి హేమంత్‌కుమార్, సీనియర్ బిజినెస్ అనలిస్ట్ మతీన్‌బేగ్, ప్రాజెక్టు లీడ్ ఎం మధుకర్ పాల్గొన్నారు.

**దోస్త్ తొలివిడత సీట్ల కేటాయింపు వివరాలు**

| | |
|---|---|
| మొత్తం కాలేజీలు | - 889 |
| మొత్తం సీట్లు | - 3,56,258 |
| వెబ్ఆప్షన్లు ఇచ్చినవారు | - 78,212 |
| సీట్లు పొందిన వారు | - 73,220 |
| మిగిలిన సీట్లు | - 2,83,038 |
| తక్కువ ఆప్షన్లతో సీట్లు పొందనివారు | - 4,992 |
| సున్నా ప్రవేశాలున్న కాలేజీలు | - 63 |

**కోర్సుల వారీగా సీట్ల కేటాయింపు**

| | |
|---|---|
| ఆర్ట్స్ | - 7,771 (10.61 శాతం) |
| కామర్స్ | - 33,251 (45.41 శాతం) |
| లైఫ్ సైన్సెస్ | - 16,434 (22.44 శాతం) |
| ఫిజికల్ సైన్సెస్ | - 13,468 (18.39 శాతం) |
| డాటాసైన్స్, ఏఐ/ఎంఎల్ | - 1,955 (2.67 శాతం) |
| డీ ఫార్మసీ | - 254 (0.35 శాతం) |
| ఇతర | - 87 (0.12 శాతం) |

**మీడియం వారీగా సీట్ల కేటాయింపు**

| | |
|---|---|
| ఇంగ్లీష్ మీడియం | - 68,494 (93.55 శాతం) |
| తెలుగు మాధ్యమం | - 4,226 (5.77 శాతం) |
| హిందీ మాధ్యమం | - 9 (0.01 శాతం) |
| ఉర్దూ మాధ్యమం | - 484 (0.66 శాతం) |
| అరబిక్ మాధ్యమం | - 7 (0.009 శాతం) |

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

- సిఎం కెసిఆర్‌కు ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. ఈ మేరకు శనివారం సిఎం కెసిఆర్‌కు మెయిల్ ద్వారా లేఖ పంపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల కానుకగా నూతన పిఆర్‌సి కమిటీ నియమించి, జూలై నుంచి 30శాతం ఐఆర్, నాలుగు శాతం డిఎ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని ఆలోచించాలని కోరారు. ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ విధానం ద్వారా అన్ని ప్రయివేట్, ప్రభుత్వ ఆస్పత్రిలో నగదు రహిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల ఆర్థిక బిల్లులను విడుదల చేయాలనీ, ఉద్యోగులందరికీ ప్రతినెల ఒకటో తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కెజిబివి ఉద్యోగుల అప్పీళ్లు పరిష్కరించాలి

- విద్యామంత్రి, కార్యదర్శికి టిఎస్‌యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 1241 ఉపాధ్యాయుల ఖాళీలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) స్వాగతించింది. అయితే నోటిఫికేషన్ ఇవ్వటానికి ముందుగా ఇప్పటికే సర్వీసులో ఉండి స్వల్ప కారణాలతో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగుల పునర్నియామకం, బదిలీలపై అప్పీళ్లను పరిష్కారం చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, కార్యదర్శి వాకాటి కరుణకు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో యుఆర్ఎస్ ఉద్యోగులకు అవకాశం ఇవ్వలేదని తెలిపారు. కెజిబివిల్లో పలువురు ఉద్యోగులు సాంకేతిక కారణాలతో కోరుకున్న స్థానాలకు బదిలీ కాలేకపోయారని పేర్కొన్నారు. అనంతరం ఆ పోస్టులు ఖాళీగా మిగిలి ఉన్నాయని వివరించారు. వాటిలో అవకాశం ఇవ్వాలంటూ దాదాపు 97 మంది ఉపాధ్యాయులు సమగ్ర శిక్ష ఎస్‌పిడికి అప్పీల్ చేసుకున్నారని గుర్తు చేశారు. జిల్లాల్లో స్వల్ప కారణాలతో విధుల నుంచి తొలగించబడిన పలువురు ఎస్ఓలు, సిఆర్‌టిలపై విచారణ జరిపి పునర్నియామకానికి ఎస్‌పిడి అనుమతి కోరుతూ జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. వాటిలో కొన్నింటిని మాత్రమే ఇటీవల అనుమతించారని పేర్కొన్నారు. మిగిలిన వాటిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. పునర్నియామక ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోకుండా ఆ ఖాళీలను నియామకాలకు నోటిఫై చేయటం సరైంది కాదని పేర్కొన్నారు. కనుక నోటిఫికేషన్ విడుదల చేయటానికి ముందే ఈ అంశాలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.




## బిసి బంధు ప్రకటించాలి.. లేదంటే ఉద్యమం

- ఎంపి ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

అన్ని రంగాల్లో వెనుకబడ్డ బిసి వర్గాల అభివృద్ధి కోసం బిసి బంధు పథకాన్ని వెంటనే ప్రకటించాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని పద్మశాలి భవన్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 'బిసి బంధు-భవిష్యత్ కర్తవ్యాలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. బిసిలను ఓటు బ్యాంకుగా చూడొద్దనీ, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. బిసిల్లో కొన్ని కులాలకే రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించి చేతులు దులుపుకోవాలని చూస్తే..బిసిల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కోదండరాం మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టిలకు సబ్ ప్లాన్ ఉన్నట్టుగానే బిసిలకు కూడా సబ్‌ప్లాన్ అమలు చేయాలన్నారు. వారి అభివృద్ధికి కేటాయించిన నిధులు ఖర్చు చేయటం లేదని చెప్పారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక షరతులకు లోబడి రూ. లక్ష రుణాన్ని ఇస్తున్నారనీ, ఈ సొమ్మును మరింత పెంచాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ బిసి కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలమల్లేశ్, మాజీ శాసన సభ్యులు ఈరావతి అనిల్‌కుమార్, పిసిసి ఉపాధ్యక్షులు సింగిశెట్టి జగదీశ్, ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, తెలుగుదేశం జాతీయ ఉపాధ్యక్షులు చిలువేరు కాశీనాథ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోగ శ్రావణి, పద్మశాలి సంఘం అధ్యక్షులు కందిగట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశానికి యర్రమాద వెంకన్న నేత అధ్యక్షత వహించారు.

## సత్వ నెక్లెస్ మాల్‌లో సీతాకోకచిలుకల ప్రదర్శన

**హైదరాబాద్ :** రియల్ ఎస్టేట్ సంస్థ సత్వ నెక్లెస్ ప్రైడ్ గ్రూప్‌లోని సత్వ నెక్లెస్ మాల్‌లో జూన్ 30 వరకు ఉత్తేజకరమైన ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది. సికింద్రాబాద్‌లోని ట్యాంక్ బండ్ రోడ్ వద్ద మాల్‌లో షాపింగ్ చేసేవారు ఉత్కంఠభరితమైన అనుభవాలను చవి చూస్తారని పేర్కొంది. విస్మయపరిచే సీతాకోకచిలుక నేపథ్యంతో కూడిన వండర్‌ల్యాండ్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. అత్యంత ఆకర్షణీయమైన సీతాకోక చిలుకల ఇన్స్టలేషన్లు, ఉత్సాహభరితమైన పూల ప్రదర్శనలు అన్ని వయసుల వారిని మంత్రముగ్ధులను చేస్తాయని పేర్కొంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

## రాజకీయ పునరేకీకరణలో కలిసి రావాలి

- సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ, సిఎం కెసిఆర్‌లను వదిలించుకోవడానికి రాజకీయ పునరేకీకరణ జరుగుతుందని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ.. లౌకిక వాదాన్ని కాపాడుకోవడం కోసం జరుగుతున్న రాజకీయ పునరేకీకరణలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులు కలిసి రావాలని కోరారు. భట్టి విక్రమార్క చేస్తున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మునుగోడు క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని రెండూ ఒకటేనని అన్నారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసైతో సిఎం కెసిఆర్ కలిసిపోయిన వైనం ఆ రెండు పార్టీల అసలు స్వరూపాన్ని బట్టబయలు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఇతర రాజకీయ పార్టీల ఉనికి లేకుండా చేయాలన్నది వారి కుట్ర అన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు, జాతీయ జెండా ఆవిష్కరణలాంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎప్పుడూ గవర్నర్‌తో కలిసి మాట్లాడటానికి, ఎదురుపడటానికి ఇష్టపడని కేసీఆర్ ఇప్పుడు సయోధ్య కుదుర్చుకున్నారని ఆరోపించారు. నిరంకుశ, నియంతృత్వ పోకడలతో ఫాసిస్టు పాలన సాగిస్తున్న ప్రధాని మోడీ, సిఎం కెసిఆర్‌ను వదిలించుకోకుంటే భావ స్వేచ్ఛ ఉండదని ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. మాట్లాడే స్వేచ్ఛ లేకుండా చేయడంలో భాగంగానే ప్రొఫెసర్ హరగోపాల్, మరికొందరిపై కుట్రపూరితంగా దేశద్రోహం ఉపా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నల్లగొండ ఎంపిపి మనిమిదే సుమన్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ జిల్లపల్లి పరమేష్, పట్టణ మాజీ అధ్యక్షులు గుమ్మల మోహన్‌రెడ్డి, డిసిసి వర్కింగ్ అధ్యక్షులు బొంత వెంకటయ్య, కౌన్సిలర్ జూలకంటి ధనలక్ష్మి శ్రీనివాస్ ఉన్నారు.

## నాలుగు కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

- హాజరైన హైకోర్టు చీఫ్ జస్టిస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో శనివారం నాలుగు కోర్టు భవనాలు, కోర్టు సిబ్బంది నివాస గృహాల నిర్మాణానికి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయన్ మాట్లాడుతూ.. భవనాలు, ఫర్నీచర్ అందుబాటులో ఉంటే కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కేసులు త్వరగా పరిష్కరించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. సత్వర కేసుల పరిష్కారానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అవసరమైన నూతన కోర్టు భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటుతో త్వరలోనే అన్ని జిల్లాల్లో నిర్మాణాలు పూర్తవుతాయని చెప్పారు. గజ్వేల్‌లో కోర్టు భవనాల నిర్మాణానికి అధికారులు చక్కని ఏర్పాట్లు చేశారన్నారు. తాత్సారం చేయకుండా కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు నవీన్ రావు, సంతోష్ రెడ్డ, సివి భాస్కర్ రెడ్డి, జిల్లా జడ్జి టి.రఘురాం, కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్, సిద్దిపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్ రెడ్డి, గజ్వేల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

## కావేరీ సీడ్ కంపెనీని సందర్శించిన ఎఫ్ఎఒ డిజి

**హైదరాబాద్ :** ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఒ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ క్యూ డోంగ్యు ప్రతినిధి బృందం కావేరీ సీడ్ కంపెనీని సందర్శించారు. డోంగ్యు బృందానికి తమ కంపెనీ గురించి కావేరీ సీడ్స్ సిఎండి జివి భాస్కర్ రావు వివరించారు. భారతదేశ వ్యవసాయానికి కావేరీ విత్తన కంపెనీ గణనీయమైన సహకారాన్ని, అతిపెద్ద విత్తన ఉత్పత్తిదారుగా దాని పాత్రను తెలిపారు. హరిత విప్లవం, వ్యవసాయ సమాజానికి కావేరీ విత్తనాలు అందించిన గణనీయమైన కృషిని డోంగ్యు ప్రశంసించారు.

## నేడు వండర్‌లాలో ప్రత్యేక ఆఫర్

**హైదరాబాద్ :** ప్రముఖ అమ్యూజింగ్ పార్క్ చెయిన్ వండర్‌లా హాలిడేస్ ఫాదర్స్‌డే సందర్భంగా ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. జూన్ 18న రెండు టిక్కెట్లు కొనుగోలు చేస్తే మరొక్కరికి ఉచిత ప్రవేశం కల్పిస్తోన్నట్లు వెల్లడించింది. మూడు టిక్కెట్‌లను కొనుగోలు చేసిన అతిథులు రెండు టిక్కెట్‌లకు మాత్రమే డబ్బులు చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంది "తండ్రీ బిడ్డల బంధం మాటల్లో చెప్పలేనంతగా అపూర్వమైన, అసాధారణమైన అనుబంధం. వండర్‌లాలో మేము ఆ బంధాలను గౌరవిస్తూ ఫాదర్స్ డేని జరుపుకోవడానికి సంతోషిస్తున్నాము." అని వండర్ లా హాలిడేస్ ఎండి అరుణ్ కె. చిట్టిలప్పిల్లి పేర్కొన్నారు.

# ధ్వంసమవుతున్న రాజ్యాంగ విలువలు

- అలాంటి పాలకులను ప్రజలు ఆరాధించడం దురదృష్టకరం
- డాక్టర్లు గోపీనాథ్, రవీంద్రనాథ్, భాస్కర్, రవిమారుత్




ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ విలువలను ధ్వంసం చేస్తున్న పాలకులను ప్రజలు ఆరాధించడం దురదృష్టకర పరిణామంగా ప్రత్యామ్నాయ పౌర సమూహం (సిసిఎ) నిర్వహణ కమిటీ సభ్యులు డాక్టర్లు గోపీనాథ్, యలమంచిలి రవీంద్రనాథ్, స్వర్ణ భాస్కర్, రవిమారుత్ అన్నారు. ఖమ్మంలోని హార్వెస్ట్ స్కూల్లో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర విధానాలు-విషాద పరిణామాలు'పై ఈ నెల 21వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజాస్వామికవాదులు పెద్దఎత్తున తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సదస్సుకు 'ద క్రూకుడ్ టింబర్ ఆఫ్ న్యూఇండియా' పుస్తక రచయిత పరకాల ప్రభాకర్ హాజరుకానున్నట్టు చెప్పారు.

ప్రత్యామ్నాయ పౌర సమూహం ఏ పార్టీకీ వ్యతిరేకం కాదని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భావన మెజారిటీ ప్రజల దృష్టిలో వక్రీకరించబడుతున్న కాలంలో "ద క్రూకుడ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా" పుస్తకంలో పరకాల ప్రభాకర్ చేసిన పరిశీలనలు ఆలోచింపజేస్తున్నాయని చెప్పారు. రైతు ఆందోళనలు మొదలు రెజ్లింగ్‌లో భారత పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించిన మహిళల వరకు, విద్యార్థుల నుంచి జర్నలిస్టుల వరకు, మైనారిటీల వస్త్రధారణ, ఆహారం, ప్రార్థనాస్థలాల వరకు అమలవుతున్న దమననీతి, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) పేరుతో మేధావులపై (భీమా-కోరేగావ్) ఉద్యమకారులపై ప్రయోగిస్తున్న నిర్బంధం కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ విధానానికి నిదర్శనమని వివరించారు. భారతదేశాన్ని, దాని అంతరాత్మను కాపాడుకోవడానికి, ప్రజాచైతన్యం పెంచడానికి దేశవ్యాపితంగా ప్రజాస్వామ్యవాదులు గొంతు విప్పుతున్నారని చెప్పారు.బిజెపి ఏలుబడిలో భారత రాజకీయ, ఆర్థిక స్థితిగతులు, రాజ్యాంగ విలువలు ధ్వంసమైపోతున్న రీతిని విశ్లేషించి, కర్తవ్య బోధన చేసే పనిని పరకాల ప్రభాకర్ 'వంకర తిరిగిన కర్రతో సరైన వస్తువుని తయారు చేయలేమని' తన పుస్తకంలో స్పష్టంగా చెప్పారని తెలిపారు.

భారత ప్రజలు ఎంత కల్లోల కాలంలో ఉన్నారో వివరించి, దాని నుంచి బయటపడటానికి అనేక విశ్లేషణలు అందించారన్నారు. ముస్లింలంతా టెర్రరిస్టులే అనే రీతిలో కేంద్ర ప్రభుత్వ వ్యవహారం ఉందన్నారు. ఇలా రూపొందించిన కేరళ స్టోరీ సినిమా ఘటనలను స్వయంగా ప్రధానమంత్రి కర్ణాటక ఎన్నికల్లో ప్రచారం చేసి..భంగపడిన విషయాన్ని ప్రస్తావించారు. బిజెపి పాలనలో న్యాయం కూడా నిలబడేలా లేదని చెప్పారు. విధుల్లో ఉండగా తమకు అనుకూలంగా తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులను రిటైర్‌మెంట్ అనంతరం గవర్నర్లుగా, నామినేటెడ్ పదవుల్లో నియమిస్తున్నట్టు తెలిపారు. ప్రజాస్వామికవాదులు హత్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్, మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా, జన్‌ధన్ యోజన వంటి పథకాలు పేరుకేగానీ ఆచరణలో అందుకు విరుద్ధ పరిస్థితులు ఉన్నాయన్నారు. 'బేటీ బచావో.. బేటీ పడావో' అంటున్న మోడీ ప్రభుత్వం.. మహిళా రెజ్లర్లను లాగేసిన తీరును చూస్తే దేశంలో బేటీకి దక్కుతున్న గౌరవం ఏపాటిదో అర్థం అవుతుందన్నారు.

నూతన విద్యా విధానం పేరుతో భగత్ సింగ్, గాంధీల పాఠాలను తొలగించి గాడ్సే పాఠాలు చేర్చుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు పోరాడే వారికి పరకాల ప్రభాకర్ పుస్తకం ఓ ఆయుధమని చెప్పారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు సదస్సుకు భారీగా తరలిరావాలని ప్రత్యామ్నాయ పౌర సమూహం కోరుతుందన్నారు. ఈ సమావేశంలో సీసీఏ సభ్యులు విజయ్, చిర్రా రవి తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కోసం 19 నుంచి ఆందోళనలు

- తెలంగాణ రైతు సంఘం పిలుపు




ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు రుణమాఫీ కోసం 19 నుంచి ఆందోళనలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం పిలుపునిచ్చింది. లక్షలోపు రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేసింది. శనివారం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ అరిబండి ప్రసాద రావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌తో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ విలేకర్లతో మాట్లాడారు. సంఘానికి సంబంధించిన రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఈ నెల 14, 15, 16 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట కేంద్రంలో నిర్వహించినట్టు తెలిపారు. చివరిరోజు రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో దేశ, రాష్ట్ర వ్యవసాయ పరిస్థితులపై చర్చించామన్నారు. ఆ ప్రభుత్వాలు అనుసరిస్తోన్న విధానాలపై కార్యచరణ రూపొందించినట్టు తెలిపారు. లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామంటూ 2018 ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. నాలుగున్నరేండ్లు గడుస్తున్నా రుణాలన్ని మాఫీ కాలేదన్నారు. గతంలో రూ. 25వేలు లోపు ఒకసారి, రూ. 50 వేలలోపు మరోసారి మాఫీ చేస్తామని చెప్పినా ఆచరణలో రూ. 7వేల కోట్లు మాత్రమే విడుదల చేసినట్టు తెలిపారు. రూ.35వేలలోపు రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయని పేర్కొన్నారు. ఫలితంగా రైతాంగానికి కొత్త అప్పు బ్యాంకుల నుంచి రాలేదన్నారు. దీంతోపాటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు తెచ్చి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ తర్వాత లక్షలోపు అప్పు ఉన్న రైతులకు రూ.50వేలు అదనపు వడ్డీ పడిందని అన్నారు. ఈ అంశంపై ఈనెల 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలియజేసి, వినతిపత్రాలు అందించాలని కోరారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం రాష్ట్రంలో 11.6 లక్షల ఎకరాల సాగు చేస్తున్న పోడు రైతులకు హక్కు పత్రాలను ఇవ్వకుండా కేవలం 4లక్షల ఎకరాలకే హక్కు పత్రాలే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరమన్నారు. ఈ నిర్ణయాన్ని పునరాలోచన చేసి అర్హులైన అందరికి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర అటవీ సంరక్షణ సవరణలు తెచ్చేందుకు పాలకులు పూనుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదివాసులను అడవుల నుంచి గెంటివేయడానికే ఈ సవరణలు చేస్తున్నారని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా జూన్ 30న దేశ వ్యాపితంగా జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ధరణి లోపాలను సవరించి, పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## త్వరలో పోడు భూములకు పట్టాలు

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఈ సంవత్సరం పూర్తిగా గిరిజన సంక్షేమ సంవత్సరంగా మారిందని, త్వరలో పోడు భూములకు పట్టాలు పంపిణీ చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గిరిజనోత్సవాల్లో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ఐఎఎస్ స్టడీ సర్కిల్‌లో ఐఐటీ, ఎన్ఐటీ, నెట్ విద్యార్థులతో మంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 91 గురుకుల పాఠశాలలు ఉంటే, రాష్ట్రం ఏర్పడిన తర్వాత 94 గురుకులాలు స్థాపించిన ఘనత సిఎంకు దుక్కుతుందన్నారు. గిరిజన సంక్షేమం కోసం సిఎం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని చెప్పారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పోడు భూములకు త్వరలోనే పట్టాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తవుతుందని తెలిపారు. గిరిజనులకు ఈ సంవత్సరం స్వర్ణ యుగంగా మారిందన్నారు. ప్రతి తండాను గ్రామపంచాయతీలుగా చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. గిరిజన విద్యార్థులు చదువుకోవడానికి అన్ని రకాలుగా ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని ఏడు యూనివర్సిటీలలో రూ.140 కోట్లతో విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అవసరమైతే జిల్లాకు ఒక స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని సిఎం ఆదేశించారని చెప్పారు.